'మట్టి అక్రమ రవాణాపై చర్యలు తీసుకోమంటే బెదిరింపులు'

గంగాధర పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

గంగాధర, డిసెంబర్ 28 : గంగాధర మండలంలోని వరదకాలువ నుంచి రాత్రి వేళల్లో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరితే, పోలీసులు తమను పోలీస్ స్టేషన్‌కు పిలిపించారని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, గట్టుభూత్కూర్ మాజీ సర్పంచ్ కంకణాల విజేందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. మట్టి అక్రమ రవాణాపై మాట్లాడినందుకు శనివారం పోలీస్ స్టేషన్‌కు రావాలని గంగాధర పోలీస్ స్టేషన్ నుంచి ఫోన్ చేశారని, అక్కడికి వెళ్లిన తర్వాత చొప్పదండి సీఐ రమ్మన్నాడని, అక్కడి వెళ్లాలని సూచించారని వారు తెలిపారు. తమనెందుకు పిలిచారో చెప్పాలని ప్రశ్నించగా సీఐ, గంగాధర పోలీసుల వద్ద సరైన సమాధానం లేదన్నారు. తాము నిజంగానే అక్రమంగా మట్టిని తరలిస్తే కేసులు పెట్టాలని, లేదంటే నిజమైన అక్రమార్కులను పట్టుకుని కేసులు నమోదు చేసి, లారీలను సీజ్ చేయాలని కోరారు. ఇరిగేషన్ శాఖ అధికారులు, పోలీసులు అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిని వదిలిపెట్టి, ప్రశ్నించిన వారిని బెదిరించేలా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా మట్టిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, దీనిపై ఎస్ఐ నరేందర్‌రెడ్డిని ఫోనులో వివరణ కోరగా, తాను సెలవులో ఉన్నట్లు తెలిపారు. సీఐ ప్రకాశ్ గౌడ్‌ను ఫోనులో వివరణ కోరడానికి ప్రయత్నించగా స్పందించలేదు.

మహా కళా ప్రదర్శన విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, డిసెంబర్ 28: ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'వెయ్యి గొంతులు-లక్ష డప్పులు' మహా ప్రదర్శనను విజయవంతంగా చేయాలని కార్యక్రమ నిర్వహణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ భరత్ పిలుపునిచ్చారు. నగరంలోని ప్రెస్ భవన్‌లో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాదిగ హక్కుల కోసం చేస్తున్న ధర్మ పోరాటానికి జిల్లాలోని కవులు, రచయితలు, గాయకులు, పురుషుల, మాదిగ ఉపకులాల వృత్తి కళాకారులు, ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఎస్‌పీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి, మహా కళా ప్రదర్శన నిర్వహణ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఒల్లాల వాణి, తెలంగాణ మాదిగ రచయితల వేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ ముక్కెర సంపత్ కుమార్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అనిల్, ఎమ్మార్పీఎస్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించాలి

కార్పొరేషన్, డిసెంబర్ 28: అధికారులు ప్రజా ప్రతినిధులతో సత్సంబంధాలు పెంచుకొని ప్రజలతో మమేకమై ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అర్హులకు అందేలా విధులు నిర్వర్తించాలని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు సూచించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో శనివారం కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆధ్వర్యంలో నూతనంగా నగరపాలక సంస్థలో నియామకమైన 48 మంది వార్డు ఆఫీసర్లకు ఓరియంటేషన్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, విధుల్లో అలసత్వం, నిర్లక్ష్యం, అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పని చేసి ప్రభుత్వానికి పేరు తేవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్, డిసెంబర్ 28: కరీంనగర్‌లోని పద్మనగర్ ప్రాంతంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో కూరగాయలు, మాంసం షాపుల కోసం అర్హులైన వ్యాపారులు దరఖాస్తు చేసుకోవాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా షాపులను జనవరి 10న లక్కీ డ్రా ద్వారా కేటాయిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు రూ.500 డిపాజిట్ రుసుము చెల్లించి నగరపాలక సంస్థ కార్యాలయంలోని పౌర సేవా కేంద్రంలో జనవరి 7లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆధునిక హంగులతో పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్

- వచ్చే నెల 10న ప్రారంభం
- మేయర్ సునీల్‌రావు
- నగర కమిషనర్‌తో కలిసి పనుల పరిశీలన

పద్మనగర్‌లో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులను పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, డిసెంబర్ 28: ఆధునిక హంగులతో నిర్మించిన నగరంలోని పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ రాష్ట్రంలోనే అత్యుత్తమంగా ఉండబోతున్నదని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శనివారం 16వ డివిజన్‌లో కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి పద్మనగర్ సమీకృత మార్కెట్‌ను సందర్శించారు. నగరపాలక సంస్థ నిధులు రూ.16.50 కోట్లతో చేపట్టిన మోడ్రన్ మార్కెట్ పనులు చివరి దశకు చేరుకోగా, అధికారులు, కాంట్రాక్టర్‌తో కలిసి పరిశీలించారు. మిగతా పనులను సైతం పూర్తి చేయించి మార్కెట్‌ను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ యాదగిరి సునీల్ రావు మాట్లాడుతూ.. జనవరి 10వ తేదీన పద్మనగర్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. ఈ మార్కెట్‌లో సుమారు 193 మంది వెండర్స్ అమ్మకాలు జరుపుకొనేలా ఏర్పాట్లు చేశామన్నారు. హైజెనిక్ కండీషన్‌లో కూరగాయలు, మాంసం, చేపలు అమ్ముకునేందుకు వీలుగా ప్లాట్ ఫామ్స్ నిర్మాణం చేసి.. అందులో లైటింగ్, ఫ్యాన్లు, నీటి సౌకర్యం కల్పించామని తెలిపారు. కిరాణా వస్తువులు అమ్ముకోవడానికి 22 షెటర్లను కూడా నిర్మాణం చేశామని తెలిపారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో జరుగుతున్న పనులన్నీ చివరి దశకు చేరాయని చెప్పారు. నిర్దేశిత గడువు మార్చి 31లోగా వాటిని పూర్తి చేయాలనే లక్ష్యంతో కమిషనర్, అధికారుల ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే 42 ప్రాజెక్టుల్లో 25 పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెచ్చామని గుర్తు చేశారు. మిగతా 17 ప్రాజెక్టుల్లో రెండు టెండర్ దశలో ఉండగా.. 15 ప్రాజెక్టుల పనులు దాదాపు 95 శాతం పూర్తయ్యాయని వెల్లడించారు. జనవరి రెండో వారం నుంచి నాలుగో వారం వరకు అన్ని ప్రాజెక్టుల పనులను ప్రారంభిస్తామని తెలిపారు. కరీంనగర్ స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో దాదాపు రూ.934 కోట్లతో చేపట్టిన పనులన్నీ కూడా 95 శాతం పూర్తయ్యాయని తెలిపారు. నగరంలో దాదాపు 130 కోట్ల రూపాయలతో పూర్తయిన ప్రాజెక్టులను జనవరిలో ప్రారంభించి నగర వాసులకు బ్రహ్మాండమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వసతులను పాలకవర్గం బహుమతిగా ఇవ్వబోతున్నదని పేర్కొన్నారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్‌లో అనేక ప్రాజెక్టులను టార్గెట్‌గా తీసుకొని పూర్తి చేశామని, నగర ప్రజలకు ఒక సంతృప్తికర వాతావరణంలో సేవలందించిన తమ పాలకవర్గం జనవరి నెలాఖరులో పదవీ బాధ్యతల నుంచి తప్పుకోబోతున్నదని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేశ్, ఎస్ఈ రాజ్ కుమార్, ఈఈ సుబ్రహ్మణ్యం, ఏజెన్సీ కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

టీఎన్జీవోల ప్రతినిధులు జవాబుదారీగా ఉండాలి

నూతన కార్యవర్గ యూనిట్లతో జిల్లా సంఘం బాధ్యులు

కొత్తపల్లి, డిసెంబర్ 28: తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల సంఘంలో బాధ్యతలు నిర్వర్తించే ప్రతినిధులు అటు ఉద్యోగానికి, ఇటు సంఘానికి జవాబుదారులుగా పనిచేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. టౌన్ యూనిట్‌తో పాటు చొప్పదండి యూనిట్ ఎన్నికలు శనివారం టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యాలయంలో జరుగగా, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి హాజరై మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించి, ఆయా యూనిట్ల ఎన్నికలు నిర్వహించారు. కాగా, కరీంనగర్ టౌన్ యూనిట్ అధ్యక్షుడిగా రాజేశ్‌భరద్వాజ్, కార్యదర్శిగా వెలిచాల సుమంత్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా పత్తెం శ్రీనివాస్, కోశాధికారిగా సల్వాజి తిరుమలరావు, చొప్పదండి తాలూకా అధ్యక్షుడిగా కామ సతీశ్, కార్యదర్శిగా గిరిధర్‌రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా సత్యం, కోశాధికారిగా తిరుపతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు లక్ష్మణరావు తెలిపారు. కార్యక్రమంలో టీజీవో నాయకులు కాళీచరణ్, అరవిందర్‌రెడ్డి, టీఎన్జీవోల సంఘం నాయకులు నరసింహస్వామి, రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, గూడ ప్రభాకర్‌రెడ్డి, హర్మిందర్ సింగ్, భిక్షపతి, రాజేశ్వర్‌రావు, శంకర్, పోలు కిషన్, కొండయ్య, శైలజ, రాధిక, లత, శారద, రఘు, శ్రీనివాస్‌రావు, కరుణాకర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కార్పొరేషన్, డిసెంబర్ 28: 34వ డివిజన్‌లోని గోదాంగడ్డలో పారిశుధ్య పనులను నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ పరిశీలించారు. సంబంధిత పనులపై అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డ్రైనేజీలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు సిల్ట్‌ను తొలగించాలని ఆదేశించారు. ప్రతి రోజూ కార్మికులు డోర్ టూ డోర్ చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షఖీరా అంజూమ్ బర్కత్ అలీ, అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్. ఎస్సే వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ మృతికి సంతాపం

సైదాపూర్, డిసెంబర్ 28: మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెలిమెల రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేని కొనియాడారు.

టీఎస్‌డబ్ల్యూసీడబ్ల్యూఏజీవో రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సబిత

సబితకుమారి

కలెక్టరేట్, డిసెంబర్ 28 : తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా జిల్లావాసి కె.సబితకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం హైదరాబాద్‌లో సంఘ ఎన్నికలు జరుగగా, రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మహిళా శిశు సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్న సీడీపీవోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇ. అక్కేశ్వర్‌రావు (డీడబ్ల్యూవో, హైదరాబాద్), అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్.మోతీ (రీజనల్ జాయింట్ డైరెక్టర్), ఉపాధ్యక్షులుగా కె.సబితకుమారి (సీడీపీవో, కరీంనగర్), బి.నాగమణి (సీడీపీవో, మేడ్చల్ మల్కాజిగిరి), ఎన్.కనకదుర్గ (సీడీపీవో, సత్తుపల్లి), కార్యదర్శిగా సబానా హుస్సేన్ (సీడీపీవో, జడ్చర్ల), జాయింట్ సెక్రటరీలుగా ఎన్.స్వరూప రాథోడ్ (సీడీపీవో, మెదక్), సీహెచ్. అనంతలక్ష్మి (సీడీపీవో, కొల్లాపూర్), జికె.సంతోషి (సీడీపీవో, చేర్యాల), కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.జ్యోత్స్న (సీడీపీవో, జహీరాబాద్), ప్రచార కార్యదర్శిగా సదియారుక్సానా (సీడీపీవో, ఆసిఫాబాద్), కార్యాలయ కార్యదర్శిగా ఐ.నీలిమా కిరణ్ (ఏసీడీపీవో, మెదక్), సాంస్కృతిక కార్యదర్శిగా వంగల హేమభార్గవి(సీడీపీవో, నర్సాపూర్), స్పోర్ట్స్ సెక్రటరీగా ఎం.కవిత (ఏసీడీపీవో, మధిర), కార్యవర్గ సభ్యులుగా ఎల్.శాంతిరేఖ(సీడీపీవో, ఆమన్‌గల్), ఆర్.మమత (సీడీపీవో, మిర్యాలగూడ), ఈ.రోజా (సీడీపీవో, మద్దూర్), సీహెచ్.శ్రీమతి (సీడీపీవో, కరీంనగర్ రూరల్) ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం ఉపాధ్యక్షురాలు డా.జి.దీపారెడ్డి వెల్లడించారు. కాగా, జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కె.సబితకుమారి ప్రస్తుతం కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి డీడబ్ల్యూవోగా కొనసాగుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో సీడీపీవోగా ఎంపికై వివిధ జిల్లాల్లో విధులు నిర్వహించారు.

పొరుగుశాఖల పెత్తనానికి మంగళం పాడుతాం: కె.సబితకుమారి

తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ గెజిటెడ్ అధికారుల సంఘం ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన కె.సబితకుమారి మాట్లాడుతూ, మహిళా శిశు సంక్షేమ శాఖలో పొరుగుశాఖల పెత్తనానికి మంగళం పాడుతామన్నారు. ఐసీడీఎస్‌లోని వివిధ కేటగిరీల్లో సీడీపీవో స్థాయి వరకు ఉన్న అధికారులకు ఇతర శాఖల్లో ఇదే స్థాయి ఉద్యోగులకు అందుతున్న మూల వేతనానికి అనుగుణంగా సాధించేందుకు నూతన కార్యవర్గం కృషి చేయనున్నట్లు స్పష్టం చేశారు. పెండింగ్ విచారణలు సత్వరమే పరిష్కరించేందుకు, క్రమం తప్పకుండా ఆడిట్ నిర్వహించేందుకు అధికారులను కోరనున్నట్లు వెల్లడించారు. తాత్కాలిక ఖాళీల్లో ఐసీడీఎస్ విభాగానికి చెందిన ఉద్యోగులకే అవకాశం కల్పించేలా ఉన్నతాధికారుల వద్ద ఒత్తిడి తేనున్నట్లు వివరించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి వికలాంగులు, వయోవృద్ధుల శాఖను విభజించే జీవో అమల్లోకి తెచ్చేలా, ఐసీడీఎస్ సమర్థత పెంచేలా, డీడబ్ల్యూవో కార్యాలయాల్లో అదనపు సీడీపీవోల పోస్టులు సృష్టించి, పనిభారం తగ్గించేలా, దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నతాధికారుల వద్ద పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు నూతన కార్యవర్గం శనివారం ఎజెండా విడుదల చేసినట్లు వెల్లడించారు.

కార్పొరేటర్‌కు నాయకుల పరామర్శ

విద్యానగర్, డిసెంబర్ 28: నగరంలోని 58వ డివిజన్ కార్పొరేటర్ రాపర్తి విజయను శనివారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, కరీంనగర్ కార్పొరేటర్లు పరామర్శించారు. కార్పొరేటర్ రాపర్తి విజయ భర్త వెంకటేశం ఇటీవల అనారోగ్యంతో మరణించగా, శనివారం పెద్దకర్మ సందర్భంగా వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, పలువురు కార్పొరేటర్లు, మాజీ ప్రజా ప్రతినిధులు విజయతో పాటు ఆమె కుమారుడు ప్రసాద్, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నల్ల బ్యాడ్జీలు ధరించి '104' ఉద్యోగుల నిరసన

నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

హుజూరాబాద్ టౌన్, డిసెంబర్ 28: తమ పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన ఎదుట ఔట్ సోర్సింగ్ 104 ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. ఆరు నెలలుగా 104 ఉద్యోగులు జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ఈ సమస్యపై ఉద్యోగ సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి అనేక సందర్భాల్లో వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేదన్నారు. ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదే తప్ప, తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపడం లేదని అసహనం వ్యక్తం చేశారు. బకాయి జీతాలు చెల్లించాలని అధికారులకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో స్వప్న, చంద్ర శేఖర్, వేణు, రాజీర్, శివ కుమార్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

హౌసింగ్ బోర్డు కాలనీ/హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 28: రాష్ట్రంలో విద్యావ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు జెల్లపెల్లి అంజన్న విమర్శించారు. నగరంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ శాతవాహన యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సామాజిక అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా ఉన్న తెలంగాణ రాష్ట్రం, నేడు పాలకుల స్వార్థపూరిత ఆలోచనల వల్ల ఆర్థిక సంక్షోభంతో సతమతమవుతుందన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సంక్షేమ హాస్టళ్లు సమస్యల కుంపటిలా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నగరంతో పాటు హుజూరాబాద్ పట్టణంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఏబీవీపీ కరీంనగర్ విభాగ్ కన్వీనర్ అజయ్ మాట్లాడుతూ, ఇతర రాష్ట్రాల్లో విద్యకు 14 శాతం నిధులు కేటాయిస్తే, తెలంగాణలో మాత్రం కేవలం 7 శాతం నిధులు కేటాయించడం సరికాదన్నారు. గురుకులాల్లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో చనిపోతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. సమావేశంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ గంట కిరణ్మయి, యూనివర్సిటీ ప్రెసిడెంట్ బాలకృష్ణ, యూనివర్సిటీ జాయింట్ సెక్రటరీ పూజ, సాత్విక, కార్యకర్తలు శివ, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

'మా భూములపై మాకు పూర్తి హక్కులు కల్పించాలి'

శంకరపట్నం, డిసెంబర్ 28: 15 ఏండ్లుగా తాము దున్నుకుంటున్న ప్రభుత్వ భూములపై తమకే హక్కులు కల్పించాలని పలువురు దళిత రైతులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మండలంలోని లింగాపూర్‌కు చెందిన మోరె రాకేశ్, చల్లూరి తిరుపతి, మోరె రమ్య, మోరె కుమార్, పీ సరోజన మండల కేంద్రంలో విలేకరులకు తమ గోడు వినిపించారు. మెట్‌పల్లి శివారులోని సర్వే నంబర్ 129లో 4 ఎకరాల ప్రభుత్వ భూమి 15 ఏళ్లుగా తాము దున్నుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు తెలిపారు. కాగా, పక్కనే ఉన్న రైతులు సదరు భూమి తమదే అని అడ్డు పడుతూ కోర్టుకు వెళ్లారని, అనంతరం కోర్టు ఆదేశాల మేరకు ఇరువర్గాల భూ హద్దులు ఏర్పాటు చేశారని చెప్పారు. తాము ఎంతో కాలంగా దున్నుకొని జీవనోపాధి పొందుతున్న ఆ భూములకు పట్టాలు మంజూరు చేసి శాశ్వత హక్కులు కల్పించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో పేదలకు ఇండ్లు నిర్మించాలి

శంకరపట్నం, డిసెంబర్ 28: లింగాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 749లోని ప్రభుత్వ భూమిని నిరుపేదల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం వినియోగించాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిట్లు గ్రామానికి చెందిన దళిత సంఘాల నాయకులు తెలిపారు. ఇక్కడ లింగాపూర్ మాజీ ఎంపీటీసీ చల్లూరి భాగ్యలక్ష్మి-రాజకొమురయ్య, మోరె రాకేశ్, తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

శంకరపట్నం, డిసెంబర్ 28: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల సీఎం కప్ జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వీ సరిత తెలిపారు. ఈ నెల 27-29 వరకు మెదక్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో బాలుర విభాగంలో పీ అనిల్, బీ ప్రవీణ్, బాలికల విభాగంలో కే అర్చన, జీ సాయితేజ పాల్గొంటారని చెప్పారు. పోటీల్లో ఉత్తమ ప్రతిభ చాటాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఇక్కడ పీఈటీలు మోహన్, తిరుపతి ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. 8977639662 / 8977639663.
NT-338986-All

PLOT FOR SALE

★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

CHANGE OF NAME

★Kasarapu Bhoom Reddy S/o. Kasarapu Deva Reddy (Old Name) H.No. 1-15/1, Konaipally, Vemulawada mandal, Rajanna Sircilla Dist. my Father name was changed to KASARAPU BHOOM REDDY, S/o. KASARAPU DEVAIAH (New Name)
NTK-00000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

జాతీయస్థాయి పోటీలకు వెళ్లి విద్యార్థి ఎంపిక

హర్షవర్ధన్

కొత్తపల్లి, డిసెంబర్ 28 : జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు జిల్లాకు చెందిన విద్యార్థి బి.హర్షవర్ధన్ ఎంపిక య్యారు. రగ్బీ క్రీడల్లో పాల్గొనేందుకు ఎంపికైన హర్షవర్ధన్ మానకొండూర్ మండలం వెల్ది గ్రామ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్నాడు. అండర్-14 విభాగంలో రాష్ట్రస్థాయి అంతర్‌పాఠశాలల క్రీడా పోటీలు మహబూబ్‌నగర్‌లో ఇటీవల జరుగగా, రగ్బీ క్రీడలో జిల్లా జట్టు నుంచి పాల్గొని, అత్యద్భుతంగా రాణించి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీడీ. ఎండీ ఉన్నీష్‌పాషా తెలిపారు. కాగా, హర్షవర్ధన్ ఎంపికపై జిల్లా విద్యాధికారి జనార్దన్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శ్రీనివాస్, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి బి.వేణుగోపాల్, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

యువకుడి బలవన్మరణం

హుజూరాబాద్ రూరల్, డిసెంబర్ 28: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కాశిరెడ్డి సాయికృష్ణ(21) శనివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సాయికృష్ణకు మూర్ఛవ్యాధి ఉండగా, ఎన్ని దవాఖానలు తిరిగినా నయం కాలేదు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సాయికృష్ణ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పక్కింటి వారు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకొని, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సాయికృష్ణ తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ తెలిపారు.

సివిల్ సప్లై హమాలీలు, స్వీపర్ల సమ్మె సైరన్

కలెక్టరేట్, డిసెంబర్ 28 : పౌరసరఫరాల శాఖ గోదాముల్లో విధులు నిర్వహిస్తున్న స్వీపర్లు, హమాలీలు సమ్మె సైరన్ మోగించారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి నిరవధిక సమ్మెకు గోదాం స్వీపర్లు, హమాలీల యూనియన్ పిలుపునివ్వడంతో, ఆశాఖ జిల్లా మేనేజర్ రజనీకాంత్‌కు శనివారం సమ్మె నోటీసు అందజేశారు. కూలి ధరల పెంపు ఒప్పందం గతేడాది డిసెంబర్‌తో ముగియగా, కొత్త రేట్ల అమలు కోసం ఈ ఏడాది అక్టోబర్ 4న పౌరసరఫరాల శాఖ కమిషనర్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నా, ఇప్పటివరక